క్లుప్తంగా

ఫార్మాభూముల్లో ఫెన్సింగ్ ఆపాలి

యాచారం: న్యాయస్థానం ఉత్తర్వులు, ఆదేశాలను అధికారులు లెక్కచేయడం లేదని ఫార్మాసిటీ వ్యతిరేక కమిటీ నాయకులు ఆరోపించారు. ఫార్మా భూముల్లో బలవంతపు సర్వే, ఫెన్సింగ్ పనులను వెంటనే ఆపాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజులకు ఫిర్యాదు చేశామని, కోర్టు ఉత్తర్వుల పత్రాలను అందజేశామని, అయినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఫార్మా భూముల్లో చెరువులు, కుంటలను మాయం చేస్తున్నారని పేర్కొన్నారు. న్యాయస్థానం ద్వారానే తమ హక్కులను సాధించుకుంటామని వెల్లడించారు.

పదోన్నతి బాధ్యత పెంచుతుంది


హెడ్‌కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న సీఐ

కడ్తాల్: పదోన్నతితో గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, దాంతో పాటే బాధ్యతలు పెరుగుతాయని సీఐ సీహెచ్.గంగాధర్ అన్నారు. కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 2006 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ రాజేందర్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఠాణాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ గంగాధర్.. రాజేందర్‌కు ర్యాంకు పదోన్నతి చిహ్నాంను అలంకరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. ఎలాంటి రిమార్కు లేకుండా విధులు నిర్వహించి, మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు తిరపతయ్య, దశరథం తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం


స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

యాచారం: బాల్య స్నేహితురాలి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో 2008–09 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన మాధవి.. ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మాధవి సహ పూర్వవిద్యార్థులు ఆమె కుటుంబానికి శుక్రవారం రూ.50 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. భవిష్యత్తులో ఆమె పిల్లల చదువులకు సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, లింగం, వెంకటేశ్, మహేశ్, కరుణాకర్, రవిచందర్, శేఖర్, పాండు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న పండితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో రామాలయం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బూడిద రాంరెడ్డి, పోరెడ్డి సుమతి, శ్రీశైలం, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, నందారెడ్డి, వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, మహేందర్, అజయ్, వెంకటేశ్, గోపాల్, చంద్రశేఖర్, ధర్మారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


మనీషా

మొయినాబాద్: తెల్లవారు జామున కొడుకుతో కలిసి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సునీల్ బహదూర్, అతని భార్య మనీషా రెండేళ్ల కొడుకుతో కలిసి గురువారం రాత్రి ఇంట్లో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో భర్త ఇంట్లో నిద్రిస్తుండగా మనీషా రెండేళ్ల కొడుకును తీసుకుని బయటకు వెళ్లింది. తెల్లవారినా తిరిగి రాకపోవడంతో భర్త పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వరిపంటకు వడగళ్ల గండం

- చేతికొచ్చే సమయంలో నేలపాలు
- ఏటా నష్టపోతున్న రైతులు
- నాలుగు రోజుల క్రితం 200 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు నష్టం


నల్లవెల్లిలో కోతకు వచ్చిన వరి


ఇటీవల మొండిగౌరెల్లి- చింతపట్ల మధ్య దెబ్బతిన్న వరి పంట

యాచారం: వడగళ్ల భయం అన్నదాతలను వెంటాడుతోంది. ఏటా యాసంగి సీజన్‌లో పంటలను నేలపాలు చేసి.. కర్షకులకు కడగండ్లు మిగుల్చుతోంది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు గ్రామాల్లో దశాబ్ద కాలంగా మార్చి, ఏప్రిల్, మే నెలలో ఈదురుగాలులతో కూడిన వడగళ్లతో.. వరుణుడు గర్జించడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. వందలాది ఎకరాల్లో వరి, కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నారు.

20 వేల ఎకరాల్లో..

ఈ ఏడాది డివిజన్‌లో యాసంగి సీజన్‌లో సుమారు 20 వేల ఎకరాల వరకు వరిని సాగు చేశారు. అత్యధికంగా యాచారం మండలంలో 4,100 ఎకరాలు, మంచాల మండలంలో 3,500 ఎకరాలు, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో పది వేల ఎకరాల్లో వరిని పండించారు. మరికొన్ని రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉంది.

సాయం చేయని సర్కార్

వరుణుడు కక్ష కట్టినట్లుగానే డివిజన్‌పై తన ప్రతాపం చూపుతున్నాడని, గడిచిన పదేళ్లుగా ఏటా వడగళ్లు కురిపిస్తూ.. కడగండ్ల పాలు చేస్తున్నాడని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటలను నేలపాలు చేస్తున్నాడని వాపోతున్నారు. కనీసం పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరుణ చూపని వానదేవుడితో నష్టపోతున్నామని, సాయం చేయాలని సర్కార్‌ను వేడుకున్నా కరుణించడంలేదని పేర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితం యాచారం, మంచాల మండలాల్లో వడగళ్లతో 200 ఎకరాలకు పైగా వరి, 50 ఎకరాలకు పైగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలు నష్టపోయాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సర్వే చేసి నివేదిక పంపించారు. కానీ నష్టపరిహారం ఎప్పుడు అందుతుందో తెలియదని రైతులు వివరించారు.

15 కొనుగోలు కేంద్రాలు

వరి పంట చేతికొచ్చే సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు డివిజన్‌లో 10 నుంచి 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300లుగా నిర్ణయించారు.

ఆకాశాన్ని చూస్తే..



ప్రతి యాసంగిలో వడగళ్ల భయం వెంటాడుతోంది. వరి పంట మరి కొద్ది రోజుల్లో చేతికొచ్చే అవకాశం ఉంది. రూ.లక్ష ఖర్చు చేసి, నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. ఆకాశాన్ని చూస్తే భయమేస్తోంది. వడగళ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– యాదగిరిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

నివేదిక పంపించాం



నాలుగు రోజుల క్రితం యాచారం మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్లు కురిసి వరి, ఉద్యాన పంటలకు నష్టం జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేసి, రైతుల వివరాలతో కూడిన నివేదికను అందజేశాం. మూడు రోజుల్లో మండలంలోని నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– రవినాథ్, వ్యవసాయాధికారి, యాచారం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పథకాల అమలులో దేశానికే ఆదర్శం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు, అందిస్తున్న చేయూతతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణం వ్యవసాయ మార్కెట్ యార్డులో తలకొండపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల మేలు కోసం ఎంతటి త్యాగాలకైనా వెనుకాడబోమని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించి, మద్దతు ధర కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వరి క్వింటాలుకు రూ.2300లు, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నామని వివరించారు. సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పరికరాలు, సామగ్రిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని చెప్పారు.

నియోజకవర్గానికి మహర్దశ

సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టం, ఎస్సీ వర్గీకరణ, కులగణనతో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గం గణనీయమైన ప్రగతి సాధించిందని, రూ.500 కోట్లతో రోడ్ల మరమ్మతులు, విస్తరణ చేపట్టామని ఎమ్మెల్యే వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మహర్దశ పట్టిందన్నారు. కార్యక్రమంలో సీఈఓ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, మార్కెట్ డైరెక్టర్లు నరేశ్ నాయక్, అంజయ్య, శ్రీశైలం, అజీం, రవీందర్, పాండురంగయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అనిత, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, నాయకులు కొండల్‌రెడ్డి, ఖాదర్, రంగారెడ్డి, యాదయ్య, ధనంజయ, ఖలీల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎండైనా.. వానైనా రోడ్డుపైనే నిరీక్షణ


బస్సుకోసం రోడ్డుపైనే ఎదురు చూస్తున్న ప్రయాణికులు

బస్టాండ్ లేక.. ప్రయాణికుల ఇక్కట్లు

మాడ్గుల: ప్రయాణ ప్రాంగణం లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం గంటల కొద్దీ మండుటెండలో రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. ఎండ తీవ్రతకు కాస్త నీడకోసం అల్లాడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద కాస్త సేద తీరుతున్నారు. బస్సు రాగానే ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇదీ మాడ్గుల మండల కేంద్రంలో ప్రయాణికుల దుస్థితి. కాలమేదైనా ఇక్కట్లు తప్పడం లేదని, గమ్యం చేర్చాల్సిన బస్సులకోసం ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ.. రోడ్డుపై పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. మండల పరిధిలో 34 గ్రామాలు ఉన్నా.. మండల కేంద్రలో బస్టాండ్ లేకపోవడం విడ్డూరంగా ఉందని, ఇప్పటికైనా పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను బలహీనపర్చేందుకు కుట్ర

- సోనియా, రాహుల్‌గాంధీపై చార్జిషీట్ దారుణం
- బీజేపీపై యువజన కాంగ్రెస్ నాయకుల మండిపాటు
- ప్రధాని మోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలు దహనం


మోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: నేషనల్ హెరాల్డ్ అంశంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చార్జిషీట్‌లో చేర్చడం దారుణమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. రాజకీయంగా గాంధీ కుటుంబాన్ని ఎదుర్కోలేక, కాంగ్రెస్ పార్టీని బలహీన పర్చేందుకు, ప్రధాని మోదీ, కేంద్రం హోం మంత్రి అమిత్‌షాలు ఈ తరహా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ.. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా రాహుల్.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజల దృష్టి మరల్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతూ.. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టి, బీజేపీ రాజకీయ కుట్రలను బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబా, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు శ్రీకాంత్, పర్వతాలు, విజయ్ రాథోడ్, లింగం, రామకృష్ణ, మహేశ్, మణికిరణ్, ప్రవీణ్‌గౌడ్, సందీప్, ఆకాశ్,నీలం శ్రీకాంత్, నరేశ్, లక్ష్మణ్, శ్రీను, శివ తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ

షాబాద్: విద్యార్థులకు కరాటే పోటీలు అవసరమని రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆస్పల్లిగూడ సమీపంలో ఉన్న కైట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మొగిలిగిద్ద ఎంజేపీ గురుకుల పాఠశాలలో 36 మంది విద్యార్థినులకు వివిధ కరాటే పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. శ్రుతి, కీర్తన, శ్రీవైష్ణవి, వర్ష, సిరిలతో పాటు తదితరులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివరంజని, ఉపాధ్యాయురాలు నాగజ్యోతి, అర్చన, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న చెన్నయ్య తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కెవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనుందని ఏఈ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అబ్దుల్లాపూర్ గ్రామం, బీసీ కాలనీ, మినీ ఇండస్ట్రియల్ పరిసరాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాగన్నగూడలోని లక్ష్మీ మెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, లక్ష్మీ గార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్‌నగర్, తుర్కయంజాల్ గ్రామం, హెవెన్స్ కార్నర్, ఎస్ఎస్ఆర్ కాలనీ, శ్రీ సాయి హ్యాపీహోమ్స్, సాయి టౌన్‌షిప్, హ్యాపీహోమ్స్, అవివాహోమ్స్, ఎంఎంకుంట, సాగర్ రెసిడెన్సీ, సాగర్ ఎన్‌క్లేవ్, రాఘవేంద్ర కాలనీ, సాయిరామ్ నగర్, జనచైతన్య కాలనీ, సూర్య సాయినగర్, గంగిరెడ్డి వెంచర్, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్‌లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పార్వతీపురం, గైరాన్‌కోట, ఎంఎన్ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మర్రిగూడ, కుర్మల్‌గూడ, రంగన్నగూడ, ఎస్‌బీఆర్ హోమ్స్, ఇంద్రానగర్, జన్నారం, ఆదిబట్ల అగ్రికల్చర్, ఆయుధాల గడ్డలో అంతరాయం కలగనుందని వెల్లడించారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య విమర్శించారు. శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ, వనంపల్లి గ్రామాల్లో పార్టీ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జంగయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. ఉపాధిహామీ పథకానికి నిధుల కొరత విధించారన్నారు. రాష్ట్రంలో నేటికి ఆసరా పింఛన్లు పెంచలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన నాయకులను నిలదీయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వీరేశం, పాపయ్య, జంగమ్మ, రాములమ్మ, చంద్రయ్య, కిష్టమ్మ, లక్ష్మమ్మ, లింగయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు గాలికి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- అభివృద్ధి పనులకు ఆటంకం
- మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరాటం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, మంత్రి పదవికోసం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరాట పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శేరిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సమన్వయ కమిటీ నిర్వహించారు. ఈ నెల 27న హన్మకొండలో చేపట్టనున్న పార్టీ రజతోత్సవ వేడుకల గురించి చర్చించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పదవి రాకుంటే రాజీనామా చేస్తానని చెబుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి.. దమ్ముంటే రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. సంవత్సరన్నర కాలంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పనులకు రూ.470 కోట్ల నిధులు మంజూరు చేయించి, ప్రొసీడింగ్స్ జారిచేసినా ఆ పనులను పర్యవేక్షించి, పూర్తి చేయడంలో మల్‌రెడ్డి విఫలం అయ్యారని దుయ్యబట్టారు. నియోజకవర్గానికి ఆయన చేసిందేమీ లేదని, తాను ఎమ్మెల్యేగా మంజూరు చేయించిన అభివృద్ధి పనులకే మల్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

భారీగా జనసమీకరణ

పార్టీ రజతోత్సవ సభకు జిల్లా నుంచి 80 వేల నుంచి లక్ష మంది జనాభాను తరలించనున్నామని మంచిరెడ్డి తెలిపారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి 100 బస్సులు, 600 కార్లలో సుమారు 7 వేల మందిని తీసుకెళ్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, పార్టీ నాయకులు వెంకటరమణారెడ్డి, వి.లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బుగ్గరాములు, రమేష్‌గౌడ్, రాంరెడ్డి, యాదగిరి, జంగయ్య, మంద సురేష్, చంద్రయ్య, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


స్లాబ్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ: ఎంపీడీఓ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే.. స్లాబ్ నిర్మాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా మండలాన్ని చేసి గత ప్రభుత్వం వదిలేసిందని, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తుందని చెప్పారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. నందిగామ మండలంలో ఎంపీడీఓ భవన నిర్మాణానికి కేవలం శంకుస్థాపన చేసి వదిలేశారని, తాము మాటలతో కాకుండా చేతలతో భవనాన్ని నిర్మిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టరు భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, శంకరయ్య, సీహెచ్.కృష్ణ, నర్సింహులు, రమేష్, రామస్వామిగౌడ్, జంగయ్యగౌడ్, రాములు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ అనిత, హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయ చైర్మన్ శ్రీహరియాదవ్ పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వేదపండితులు, పూజారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనిత, ఆలయ చైర్మన్ శ్రీహరియాదవ్, అఖిల భారత యాదవ సంఘం కార్యవర్గ సభ్యుడు రవియాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలతో సాయినాథుడికి మహామంగళ హారతి సమర్పించారు. భక్తులకు స్వామి వారి దర్శనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వప్నసతీష్, స్వామి, మహేందర్‌ముదిరాజ్, కుమార్ యాదవ్, యాదయ్య, శ్రీకాంత్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేష్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.